

ద్వైతభావంలో అంటే,
'నేను' కీ 'నేను కాదు' కీ, పరిశీలకుడికీ
పరిశీలితముకీ మధ్య జనించే
సంఘర్షణలో శక్తి వృథా అవుతున్నది.


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూడిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA DEC.08 - MAR. 2009 Rs.2/- VOL. III ISSUE 2


## విజ్ఞానం సేకరిస్తూ అజ్ఞానంలో

**(ముంబాయి విశ్వవిద్యాలయంలో చేసిన మొదటి ప్రసంగం-1969)**

ఇది విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సమావేశం. కానీ చాలా తక్కువ మంది విద్యార్థులు కనబడుతున్నారు. ఈ కొద్దిమందినే ఉద్దేశించి ప్రసంగిస్తే మీకు అభ్యంతరం ఉండదని అనుకుంటాను.

అసలు ఎందుకు విద్య నేర్చుకోవాలి అన్న సందేహం అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుంది. ప్రపంచంలో జరుగుతున్న విషయాల గురించి తెలుసుకోవడం కోసమా? సాంకేతిక, సాంఘిక, ఆర్థిక మొదలైన రంగాలలోని సమాచారం కోసమా? ఆ పరిజ్ఞానం ఎలాగూ అవసరమే. మనలో బహుశా చాలామందిమి కళాశాలలకి వెళ్ళేది ఇందుకోసమే. భవిష్యత్తు కోసం తయారవడానికి. తయారవడం అనే దాని అర్థం నిజానికి ఏదైనా, అక్కడికి వెళ్ళేది మాత్రం మనం ముందు ముందు గడపబోయే నిత్యజీవితాన్ని దృష్టిలో పెట్టుకొనే. అంటే ఉద్యోగం సంపాదించుకోవడం, దాన్ని నిలుపుకోవడం, ఇంకా సామర్థ్యం ఉంటే విజయాల పల్లకీ ఎక్కడం. వీటన్నిటికీ వైజ్ఞానిక, ఆర్థిక, సాహిత్య రంగాలలో పరిజ్ఞానం అవసరమే.

మరి విజ్ఞానానికైనా, తెలియనితనానికైనా ఆరంభం ఎక్కడ? ప్రపంచంలో ఉన్న సమస్త సాంకేతిక శాస్త్రజ్ఞానాన్నంతా పొంది ఉండవచ్చు. అణువు గురించీ, పెద్ద పెద్దకంప్యూటర్లని తయారు చేయడం గురించీ, ఇంకా ప్రస్తుత ప్రంచంలో మానవుడు చేస్తున్న అనేక మహాకార్యాల గురించీ తెలుసుకోవచ్చు. అత్యద్భుతమైన, బ్రహ్మాండమైన సాంకేతిక విప్లవం ప్రస్తుతం సంభవిస్తోందని మనలో చాలా మందికి తెలుసుననుకుంటాను. మనం ఎంతో విజ్ఞాన వంతులమవుతున్నాం. చంద్రుణ్ణి చేరగలిగాం. ఇంకా ముందుకు వెళ్ళగలుగుతాం. ప్రపంచాన్నీ, ప్రకృతినీ వాటి ఉత్పాతాలను మరింత సమర్థవంతంగా ఎదుర్కొనగలుగుతున్నాం. ఎందుకంటే మన బుద్ధి అమిత శక్తివంతమైనది. మరి అజ్ఞానం అంటే ఏమిటి? సమకూర్చుకున్న పరిజ్ఞానం అంటే మీకు తెలుసు. కళాశాలకో, విశ్వవిద్యాలయానికో వెళ్ళడం, మీ అదృష్టం బాగుంటే ఆ ప్రొఫెసర్లూ, నిపుణులూ నేర్పే పుస్తక జ్ఞానాన్ని బాగా ఆర్జించడం-ఇదీ మనం పరిజ్ఞానం అని పిలిచేది.

మరి అజ్ఞానం, తెలియనితనం అంటే? మనం అజ్ఞానులం కాబట్టి పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ప్రపంచంలో బ్రతకడానికి ఈ క్లిష్టమైన సమాజంలో వ్యవహరించడానికి

☞ 2

## సంతోషాన్ని వెతికి పట్టుకోగలమా?

*(గత సంచిక తరువాయి)*

**ప్రశ్నిస్తున్నవారు:** బహుశ భాషా నిర్మాణంలో ఇది అంతర్జాతంగా వున్న విషయమేమో.

**కృ:** అవునేమో, బహుశ. అయితే దానిని గురించి ఇక్కడ ఎక్కువగా చర్చించడం అనవసరం. అప్పుడు అసలు అంశాన్నుండి దూరంగా వెళ్ళిపోతాం. తెలివితేటలు, తెలివితేటలు జరిపే చర్య- అంటే విచారం అనే సమస్యను చూడటం, రెండూ ఒకటే. వాటిని విభజించలేము. అని మేము అంటున్నాం. అంతేకాకుండా విచారాన్ని అంతం చేసుకోవడం గాని, సంతోషాన్ని పొందడం గాని దాని నుండి ఆ తెలివినుండి విడిగా లేవు.

**ప్రశ్నిస్తున్నవారు:** ఆ తెలివి తేటలను నేను ఎట్లా సంపాదించాలి?

**కృ:** మేము చెప్తున్నది మీకు అర్థమయిందా?

**ప్రశ్నిస్తున్నవారు:** ఆ, అయింది.

**కృష్ణమూర్తి:** మీకు అర్థం అయివుంటే కనుక ఈ చూడటమే తెలివితేటలు అని మీరు గ్రహించి వుంటారు. మీరు చేయగలిగినదల్లా చూడటం. తెలివితేటలను మీరు పెంచి పోషించుకోలేరు, అలవరచుకోలేరు, చూడటం కోసం గాను. చూడటం అంటే తెలివితేటలు అలవరచుకోవడం కాదు. తెలివి కంటె, సంతోషం కంటె, విచారంకంటె కూడా చూడటం ప్రధానమైనది. చూడటం

☞ 6

(1వ పేజీ తరువాయి) . . .

## ముంబాయి విశ్వవిద్యాలయంలో చేసిన మొదటి ప్రసంగం-1969

అది మనకు అవసరం. ఉద్యోగం కోసం మాత్రమే కాదు, ఆధునిక ప్రపంచంలో బ్రతకడానికి కూడా పరిజ్ఞానం కావాలి. నిజమే. ఇది అవసరం అని చాలా మంది అంగీకరిస్తారనుకుంటాను. ఈ అజ్ఞానం, తెలియనితనం అనేది ఏమిటి? అసలు ఈ ఎఱుక లేకపోవడం అనే దాన్ని గురించి శోధించాలని మనకుఅనిపిస్తుందా? మనం చాలా పరిజ్ఞానాన్ని పోగుచేసుకొని ఉండవచ్చు. కానీ ఈ తెలీనితనం లేదా అజ్ఞానం అనే క్షేత్రాన్ని పరిశోధించలేదు.

మరి అజ్ఞానం అంటే ఏమిటి? మనలో నిక్షిప్తమై ఉన్న అద్భుతమైన, సంకీర్ణమైన గూఢ మానసిక ప్రపంచాన్ని నిర్లక్ష్యం చేయడం కాదా అజ్ఞానం అంటే? చూడబోతే అక్కడ కూడా ఎవరో వేదాంతులో, మానసిక శాస్త్రవేత్తలో, విశ్లేషకులో చెప్పిన శాస్త్ర జ్ఞానమే కనబడుతుంది. భగవద్గీత, ఉపనిషత్తులూ, ఖొరాన్, బైబిల్, ఫ్రాయిడ్, జంగ్- ఇలా వేరెవరివల్లో తెలుసుకున్నదే. కానీ ఇదంతా కదలిక లేని మృతజ్ఞానం. ఎందుకంటే మనని గురించి ఇంకెవరి ద్వారానో తెలుసుకున్నది కాబట్టి. మనం ఏమిటో, ఎలా ఆలోచించాలో, ఏమి ఆలోచించాలో ఇదంతా ఇంకొకళ్ళనించి తెలుసుకొని ఆ సమాచారాన్ని పెంచి పోషించుకోవడం-ఇదంతా పరిజ్ఞానమా? అజ్ఞానమా? మనలో జరిగే ఈ అద్భుత అసాధారణప్రక్రియని లోదృష్టితో చూడడానికీ, గమనించడానికీ, అర్థం చేసుకోవడానికీ ఇతరుల మీద ఆధార పడడం-అసలు అజ్ఞానం అంటే ఇదే కదా? మన గురించి మనం ఏం ఆలోచించాలి అన్న దాని కోసం ఎవరో ప్రవీణుల మీద ఆధారపడటమే కదా తెలీనితనం అంటే? వేదాంతుల కళ్ళతో, మతాచార్యుల దృష్టితో మనల్ని మనం చూసుకోవడం కన్నా అజ్ఞానం ఏముంది?

ఒక పక్క ప్రకృతి గురించీ, పదార్థాల గురించీ అనేక శాస్త్రాల గురించీ సమాచారాన్ని పెంపొందించుకుంటున్నాం. కానీ జీవితంలో అత్యంత ముఖ్యమైన మన మనసు నిర్మాణాన్నీ, స్వభావాన్నీ నిర్లక్ష్యం చేస్తున్నాం. ఎన్నో తెలివితేటలు ఉండవచ్చు. ప్రపంచ సంఘటనల గురించి ధారాళంగా తెలుసుకొని ఉండవచ్చు. ఎంతో సాంకేతిక ప్రజ్ఞ సాధించవచ్చు. కానీ మన లోపల ఏం జరుగుతుందో అసలు పట్టించుకోనపుడు అది నిర్లక్ష్యం యొక్క రూపమే. ఖచ్చితంగా అజ్ఞానమే. ఒక పక్క అసాధారణమైన అద్భుత విజ్ఞానం. మరో పక్క ఘోరమైన అజ్ఞానం.

ఎన్నో విశ్వవిద్యాలయాలు - ఇవి కమ్యూనిష్టులవి కానివ్వండి, పెట్టుబడిదారులవి కానివ్వండి లేదా ఈ భారతదేశంలో ఉన్నటువంటివి కానివ్వండి - ఇలాంటివి ఎన్ని ఉన్నా ఈ నిర్లక్ష్యం, మన గురించి మనకే తెలియనితనం ఇదంతా ఒక మహావిపత్తుని సృష్టిస్తుంది. మానసికంగా లోపల జరుగుతున్న దాని పట్ల ఉన్న పూర్తి నిర్లక్ష్యం, విభజనా మహోపద్రవాన్ని సృష్టిస్తున్నాయి. ప్రపంచంలో ఏం జరుగుతోందో కొంచెం పరికించి చూస్తే, గమనిస్తే ఈ విషయం ఎవరికైనా తెలుస్తుంది

పెరిగిపోయిన జనాభా, తీవ్రమైన అనిశ్చితీ, అభద్రతా నెలకొన్న ఈ ప్రపంచంలో తమ జీవితంలో మరింత భద్రత కావాలనో, లేక ఇంకా మంచి ఉద్యోగాలు కావాలనో విద్యార్థులు ప్రపంచమంతా అలజడులు రేపుతున్నారు. అభద్రతని తట్టుకోలేకే మనం మన గురించి తెలుసుకోవడానికి ఇంకొకళ్ళవైపు చూస్తాం. బయటా, లోపలా అంటూ ఎప్పుడైతే మన జీవితాన్నీ, ప్రపంచాన్నీ విభజించామో అప్పుడే సంఘర్షణ, దౌర్భాగ్యం మొదలవుతోంది. మన ధ్యాసని బాహ్యం మీద పెట్టి, అంతర్గతాన్ని పూర్తి నిర్లక్ష్యం చేయడంవలననో లేదా మన ఆలోచన అంతా అంతర్ముఖంగా చేసి బయటిదాన్ని పూర్తిగా ఉపేక్షించడంవలననో మనకీ దురవస్థ ప్రాప్తించింది. బయటిదాన్ని నిరాకరించడమంటే కేవలం నిజం యొక్క సారాన్ని కోరి, దాని నైజం వ్యక్తమయ్యే ప్రపంచాన్ని పట్టించుకోక పోవడమన్నమాట.

కాబట్టి మనకి ఈ రెండు ప్రపంచాలున్నాయి. బాహ్యమూ, అంతర్గతమూ. అలానే మనం మనిషిని కూడా విడదీశాం. ఉన్నతమైన ఆత్మ అనీ, ఇంద్రియాలతో ఉన్న శరీరమనీ రెండు స్థితులుగా, సత్వాలుగా విడగొట్టుకున్నాం. కానీ గమనించగలిగితే శరీరానికీ, మనసుకీ మధ్య నిరంతరంగా సంబంధం కొనసాగుతోందనీ, ఈ రెండూ పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటూ ఉంటాయనీ తెలుసుకోవచ్చు. కాబట్టి బయట కనబడుతున్న దానిలో విప్లవం తేవడం ఎలా అని కాదు ప్రశ్న. వెలుపల ఉండేవాటిని మార్చడానికి ఎన్నో తిరుగుబాట్లు జరిగాయి. కానీ మనిషిని అవేవీ మార్చలేకపోయినాయి. కొన్ని లక్షల మందిని నాశనం చేసి మనుషుల్ని ఒక చట్రంలో బంధించడానికిప్రయత్నించిన విప్లవాలు- కమ్యూనిష్టు, ఫ్రెంచి- అన్నీ ఘోరంగా విఫలమైనాయి.

అయితే నిజమైన విప్లవం అనేది ఒక్కటే. అది అంతరంగంలో సంభవిస్తూ, బయట ఉన్నదానిని కూడా ప్రభావితం చేసేది. ముందు అంతర్గతంగా తరువాత బాహ్యంగా కాదు. అలా అని, ముందు వెలుపల, తరువాత లోపలా జరిగేదీ కాదు. అది మొత్తం ఒకే కదలిక. ఒకే ప్రక్రియ. కాబట్టి లోపల ఉన్నదానిని పట్టించుకోకుండా, తెలుసుకోకుండా ఉండలేం. ఎందుకంటే అంతర్ముఖంలో ఉండే ఆశలూ, కాంక్షలూ, బంధాలూ, కోరికలూ, ప్రేరణలూ, అవసరాలూ - ఇవన్నీబాహ్యవ్యక్తీకరణనీ, దాని రూపాన్నీ, దాని నీతినియమాలనీ మారుస్తాయి. కాబట్టి అంతరంగంలో ఉన్న దానిని మనం పరికిస్తున్నాం - అంటే బాహ్యంగా ఉన్నదానిని నిర్లక్ష్యం చేస్తున్నామని కాదు. నవీన చట్టాలూ,

## ఒక ఆకు కథ

**వసంత ఋతువులో చిగురించిన ఒక ఆకును తీసుకోండి. ఎంత కోమలంగా ఉంటుంది. అయినా కూడా గాలి తాకిడికి తట్టుకొనే అసాధారణమైన బలమూ ఉంటుంది. వేసవిలో ఆకు ముదురుతుంది. శీతకాలం వచ్చేసరికల్లా పండబారి పసుపు రంగులోకి తిరిగి,అటుపై చనిపోతుంది. జీవితంలో మనకి కనబడే అద్భుత సౌందర్య దృశ్యాలలో ఒకటి ఇది. ఈ సమస్త ప్రక్రియ ఒక సౌందర్య ప్రవాహం. అరక్షణీయ సౌకుమార్యపు స్రవంతి. ఎంతో ఎంతో మృదువుగా వుండే ఆ చిగురుటాకు నిండుదనం చేకూర్చుకొని, రూపురేఖలు దిద్దుకొని వేసవిని కలుసుకుంటుంది. ఆపైన హేమంత ఋతువులో బంగారంగా మారుతుంది. ఇది సౌందర్యంనుండి సౌందర్యంలోకి ఒక నిరంతర ప్రవాహం. వసంత పత్రంలోను, మరణిస్తున్న శిశిర పత్రంలోను సంపూర్ణత్వం ఉన్నది.**

**మనిషి ఎందుకని ఇలా జీవించి, ఇలా మరణించ లేకపోతున్నాడు? మొట్టమొదటి నుంచీ చివరి వరకు అతడిని ధ్వంసం చేస్తున్నది ఏమిటి? ఒక పది ఏళ్ళ వయసున్న, లేదా పన్నెండో పదమూడో ఏళ్ళున్న పిల్లవాడిని చూడండి. ఎలా గలగల మని నవ్వుతూ నవ్వులతోనే నిండిపోయి ఉంటాడో చూశారా? నలభై ఏళ్ళు వచ్చేసరికల్లా కఠినంగా, ఊయిలా అయిపోతాడు. అతడి మొత్తం వైఖరీ అతడి ముఖమూ మారిపోతాయి. ఒక పద్ధతిలో చిక్కుకొని పోయి ఉంటాడు.**

*(ట్రెడిషన్ అండ్ రివల్యూషన్; అ-10)*

సంఘానికి సంబంధించిన కొత్త ఏర్పాట్లూ, నూతన ఆర్థిక సాంఘిక కట్టుబాట్లూ- ఇలా బహిరంగంగా ఉన్నదాన్ని ఎంతో మార్చవచ్చు గాక. కానీ లోపల ఉన్నదాన్ని అర్థం చేసుకోకుండా మానవుడి సమస్యని మనం పరిష్కరించలేము. బాహ్యంగా ఇంకొంచెం క్రమత్వం, పద్ధతి తీసుకొనిరావచ్చునేమో కానీ అదంతా చివరికి లోపల ఉన్న కాంక్షలూ, కోరికలూ, అత్యాశలూ, భయాల వల్ల కుప్పకూలక తప్పదు. మీకు ఇతరత్రా ఎంతో పాండిత్యం, ఎన్నో డిగ్రీలూ ఉండవచ్చు. కానీ మన లోపల ఏం జరుగుతోందో తెలుసుకోకపోవడమే అసలు అజ్ఞానం. తెలుసుకోవడం అంటే ఎవరో ప్రొఫెసర్ ద్వారానో, గురువుద్వారానో ఏదో ఒక వేదాంతం ప్రకారమో కాదు. అసలు నిజంగా ఏం జరుగుతోందో తెలుసుకోవడం. ఎలా ఉండాలో కాదు - ఏం ఉందో దాన్ని తెలుసుకోవడం. మన లోపల జరుగుతున్న దాని పట్ల ఉన్న నిర్లక్ష్యమూ, ప్రపంచంలో జరుగుతున్న విభజనా సామాజిక ఉపద్రవాలని తెచ్చి పెట్టడమే గాక మానవమస్తిష్కాన్ని కూడా పూర్తిగా వక్రీకరిస్తున్నాయి. అన్నింటికన్నా ముఖ్యంగా దీన్ని గురించే మనం వివేచించి, అన్వేషించాలనుకుంటాను. అంటే ఇదంతా మీకు మీరుగా చేసే అన్వేషణగా, గమనికగా ఉండాలి- ఇంకెవరో చెప్పినట్లుగా కాదు.

ఈ అన్వేషణకి మొట్టమొదట కావలసినది స్వేచ్ఛ. ముందే ఏర్పరచుకొన్న ఏదో నమ్మకం, కుతర్కం, ఆశ - తద్వారా కలిగే నిరాశ, భయం - ఇలాంటి వాటితో నిండి వున్న మనసు స్వేచ్ఛగా ఎప్పటికీ అన్వేషించలేదు. ఆత్మ ఉందనో లేదనో, ఆఖరు పరిష్కారం మార్క్సిజమో, వేదాంతమో, మతమో, మతరాహిత్యమో - ఇలాంటి నిశ్చయాలకీ, నమ్మకాలకీ తగుల్కొని ఉన్న మనసు అన్వేషించలేదు. కాబట్టి ముందు కావల్సింది ఇలాంటి వాటి నుండి విముక్తి.

అంతర్గతంగా మనకి స్వేచ్ఛలేదు. మీ దగ్గర చాలా ధనం ఉండవచ్చు. ప్రపంచం అంతా చుట్టబెట్టే ఉద్యోగం చేస్తూ ఉండవచ్చు. కానీ స్వేచ్ఛ అంటే అది కాదు. స్వేచ్ఛ అంటే నేర్చుకోవడం, అన్వేషించడం, తెరలు తొలగించడం, క్రొత్తదాన్ని కనిపెట్టడం. బలమైన కోరికలు, గాఢమైన బంధనాలు ఉన్నంత కాలం అన్వేషించడం, నేర్చుకోవడం సాధ్యపడదు. శాస్త్రజ్ఞుడు సూక్ష్మదర్శినిలో చూసి, పరీక్షించి కొత్త విషయాన్ని తెలుసుకోవాలంటే, తనకు అంతకుముందున్న అభిప్రాయాల్నించి విముక్తం కాక తప్పదు. ముందే ఏవో సిద్ధాంతాలూ, అభిప్రాయాలూ మనసులో ఉంచుకుంటే నిజంగా ఉన్నదాన్ని చూడలేడు. అలాగే మనోప్రపంచంలో అన్వేషించాలంటే ఏమాత్రమూ పరిమితి లేనిదీ, సాపేక్షం కానిదీ అయిన శుద్ధ సంపూర్ణ స్వేచ్ఛ అవసరం.

కాబట్టి మన పరిశీలనకి సహాయపడే అలాంటి స్వేచ్ఛ అంటే ఏమిటో మనం శోధించాలి. ఏది కావాలంటే అది పరిశీలించగలిగే స్వేచ్ఛ గురించి కాదు మనం మాట్లాడేది. ఏ బంధనాలు లేకుండా చూడగలిగే స్వేచ్ఛ గురించి. ఎందుకంటే చూసే మనసులో, హృదయంలో, బాహ్య లేదా అంతర్గత నేత్రంలో ఏరకమైన మెలిక, వక్రత ఉన్నా సరే- ఈ అన్వేషణకి అర్థం ఉండదు. అవునా కాదా? 'నేను హిందువును' అనుకుంటూ నా నమ్మకాలతో, బంధనాలతో, పక్షపాత దృష్టితో పరిశీలిస్తే సరిగ్గా చూడలేను. ఒక వేళ అలా చూస్తే, ఏం చూడాలని భావిస్తానో అదే చూస్తాను. నాకు ఉన్న బంధనాలూ, చేయబడ్డ బోధనలూ నా నేపథ్యంలోంచి ఉబికి వచ్చి నేనేం చూడాలనే దాన్ని నిర్దేశిస్తాయి. దాని ప్రకారం ఏం చూడాలని భావిస్తానో అదే చూస్తాను. అందువల్ల ఈ వక్రతని తొలగించుకోవడమే స్వేచ్ఛ.

భయం లేనప్పుడే స్వేచ్ఛ ఉండే అవకాశం ఉంటుంది. భయం మనల్ని సరిగా చూడనివ్వదు. చీకటిలోనే ఉంటూ వెలుగు కోసం వెతుక్కునే మనసులాగా ఉంటుంది. ఏ రకమైన భయమూ లేనప్పుడు మనసుకీ, హృదయానికి ఉన్న కదలికే స్వేచ్ఛ. అవును కదా? అయితే మన మనసూ, మెదడూ, ఈ శరీరం - ఇవన్నీ భయాన్ని పూర్తిగా వదలించుకోగలవా. ఇప్పుడు మనం కలిసి కనిపెడదాం ఈ విషయాన్ని. మీరు ఏం చెయ్యాలో ఈ ఉపన్యాసకుడు చెప్పబోవడం లేదు. 'మీకేదో నేర్పించి, కంఠతా పట్టించి తరవాత ఎప్పుడో భయంపోగొట్టుకోడానికి దాన్ని ఉపయోగించడం' లాంటి పద్ధతి కాదిది. ఈ పద్ధతిని లక్షల సంవత్సరాలుగా మనం ఉపయోగించాం. మనం చెయ్యబోయేది అది కాదు. మనంతట మనమే భయం అంటే ఏమిటో తెలుసుకొని దాన్ని పరిశీలించి, నేర్చుకుని, దాని లోపలికి వెళ్లి మన మనసు దాన్ని వదల్చుకోగలుగుతుందా అన్న విషయం కనుక్కుందాం.

అనేక రకాల భయాలున్నాయి. సహజాతంగా మనలో ప్రాణం కోసం ఉన్న భయం; శరీరావసరాలయిన అన్నవస్త్ర నివాసాలకి సంబంధించిన భయం, ఏదైనా ప్రమాదం గురించిన భయం; ఇవేకాక ఇంకా ఎన్నో రకాల భయాలున్నాయి. వీటిల్లో కొన్నింటి లోపలికి మనం వెళదాం. జీవించడం కోసం భౌతిక శరీరం కోరే రక్షణ - ఇది కూడా భయమేనా? మీకు ఒక అపాయం ఎదురైనప్పుడు-పామునో, క్రూరమృగాన్నో చూసినప్పుడు తక్షణం మీరు చేసే ప్రతిచర్య- భయం నించి వచ్చేదేనా? అవునో, కాదో నేను మీకు చెప్పబోవడం లేదు. మనం ఒకళ్ళకొకళ్ళు ఈ విషయాలు చెప్పుకుంటూ దీన్ని గురించి నేర్చుకుంటున్నాం. మనం కలిసి అన్వేషిస్తున్నాం. మన శరీరం - దాన్లో ఉన్న మెదడూ - వేల ఏళ్ళుగా ఇలాంటి భౌతిక ప్రమాదాల నెదుర్కోవడానికి నిబద్ధీకరించబడి, తక్షణం ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉంటాయి. పామును చూసినపుడు వచ్చేతక్షణ స్పందన - ఇది భయం వల్ల వచ్చేదా లేక దీన్లో 'తెలివి' ఏమన్నాఉందా?

ఈ ప్రశ్నని మీకు మరే వివేచించండి.

## ప్రకృతి అంటే ఏమిటి?

ప్రకృతి అంటే ఏమిటి? ఎంతో చర్చ జరుగుతున్నది. ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు-ప్రకృతిని, జంతువులను, పక్షులను, తిమింగిలాలను, డాల్ఫిన్ చేపలను రక్షించుకోవాలని; కలుషితమైపోయిన సరస్సులు పంటపొలాల నుండి కాలుష్యాలను తొలగించి శుభ్రం చేయాలనీ ఇంకా అవీ ఇవీ ఎన్నో అంటున్నారు. మతాన్ని, విశ్వాసాన్ని తయారు చేసినట్లుగా ప్రకృతిని ఆలోచన తయారుచేయలేదు. ప్రకృతి అంటే పెద్దపులి-అపరిమితమైన శక్తి, గొప్ప బలదారుఢ్యాలతో ఠీవిగా నడిచే ఆ అద్భుతమైన జంతువు. ప్రకృతి అంటే విశాల మైదానంలో ఒంటరిగా నిలబడి ఉన్న ఆ వృక్షం. ఏపుగా పచ్చగడ్డి పెరిగిన ఆ బయళ్ళు, ఆ తోట, కొమ్మల మధ్యన దాగి సిగ్గుపడుతూ నిక్కి చూస్తున్న ఆ ఉడుత. ప్రకృతి అంటే ఆ చీమ, ఆ తేనెటీగ, ఆ తుమ్మెద. అంతేకాదు ఈ పృథ్వి మీద నివసిస్తున్న సమస్త ప్రాణులు కూడా. ప్రకృతి అంటే ఆ నది. ఏదో ఒక్క నది కాదు. గంగ కాదు, థేమ్సు కాదు, మిసిసిపీ కాదు.నది. ప్రకృతి అంటే ఆ పర్వతాలు. పర్వతాలు అన్నీ, మంచు కప్పుకున్నవీ, ముదురు నీలపు లోయలు కలవీ, సముద్రం వరకు పరచుకున్న కొండల వరుసలూ.... వీటన్నింటి ఎడల మన హృదయంలో సహానుభూతి ఉండాలి. వాటినిధ్వంసం చేయడం కాదు.మన సంతోషం కోసం వాటిని సంహరించడం కాదు.

*(లెటర్స్‌టు ది స్కూల్స్ నుండి)*

ఉపన్యసిస్తున్న ఈ వక్త నించి దీనికి జవాబు ఆశించకండి. అలా ఆశిస్తున్నపుడు ఈ ఉపన్యాసకుణ్ని పెద్ద అధిపతిగాతయారు చేస్తారు. మన కళాశాలో అన్నీ తెలిసిన ఆచార్యుడే సర్వాధికారిగా ఉన్నట్లు. దయచేసి ఈ వక్తని అలా మార్చకండి. అధికారం, అధిపత్యం అనేవి మనం అన్వేషించేటప్పుడు స్వేచ్ఛని పరిహరిస్తాయి. మనం మాట్లాడుతున్న విషయాలకి సంబంధించినంత వరకూ ఎలాంటి ఆధిపత్యమూ, అధికారమూ లేవు. ఏ రకమైన అధికారాన్నైనా విసిరి పారవేయడమనేదే చాలా గొప్ప గ్రహింపుతో చేసే చర్య – ఏ అన్వేషణలోనైనా. ఆ చర్యతోనే మీ మనసుకి స్వాతంత్ర్యం వచ్చేస్తుంది. అధిపత్యం అనేది ప్రస్తుత మనం మాట్లాడుతున్న విషయం కాదు. కానీ భయాన్ని అర్థం చేసుకునే ప్రక్రియలో అధికారానికీ, భయానికీ ఉన్న సంబంధం గురించి తెలుసుకుందాం.

మళ్ళీ మనం అడుగుతున్న ప్రశ్న దగ్గరకొద్దాం. మనం ప్రమాదాన్ని ఎదుర్కొనే సమయంలో తీసుకునే తక్షణ చర్య భయం వల్లనేనా? సృష్ట్యాది నించీ మన మెదడూ, శరీరపు కణాలూ అపాయానికి తక్షణమే స్పందించడానికి అలవాటు పడ్డాయి. ఇది భయం కాదు తెలివి. అపాయాన్ని గమనించి దానివల్ల వినాశనం, మరణం సంభవించవచ్చుననే ఈ తెలివి ప్రాణాన్ని నిలుపుకోగోరుతుంది. ఈ విషయం చాలా కొత్త ప్రశ్నల్నిరేపుతుందని నాకు తెలుసు. భయాన్ని అర్థంచేసుకోవడం మొదలుపెడితే ఆ ప్రశ్నల్ని మనం ఎదుర్కొనవచ్చు.

ఇప్పుడు మనం 'భయం' అనే దాని లోపలికి వెళ్ళి పరిశీలిద్దాం. పైపై చేతన (బహిశ్చేతన, ఉపరిచేతన) లో ఉన్న భయాల గురించే కాదు, ఈ పరిశీలన. గాఢమైన లోతులలో, లోలోపల పొరలలో దాగిన వాటిని గురించి కూడా. ఈ పరిశీలన ఏవో వదాలనీ, సూత్రాలనీ అనుసరించడం ద్వారా జరిగేది కాదు.మనలోనే ఉన్న భయాలను గమనించడం ద్వారా జరుపుతున్నాం. మీరు ఒక విద్యార్థి అయితే భవిష్యత్తును తల్చుకొని మీరు భయపడతారు. విపరీతమైన జనాభా, ఉద్యోగ విషయంలో అనిశ్చితి ఉన్న ఈ దేశంలో భవిష్యత్తుపట్ల భయం స్పష్టంగానే కనిపిస్తూ ఉంటుంది. ఈ భయాలు ఉన్నప్పుడు, సమాజపు బాహ్యనిర్మాణాన్ని గురించి గానీ, అంతకన్నా క్లిష్టమైన లోపలి మానసిక క్షేత్రాల గురించి గానీ అన్వేషణ సాగదు. కాబట్టే భయాన్ని గురించి అర్థం చేసుకొని, నేర్చుకొని దాని స్వరూప, స్వభావాల గురించి ఎఱుక కలిగి ఉండాలి.

భయం అంటే నిరోధం, ప్రతిఘటన, అంటేనే విభజన. విభజన ఉన్నప్పుడు అభద్రతా భావం ఉంటుంది. కాబట్టి భయమూ ఉండి తీరుతుంది. దీన్నంతా మనం కలిసి తెలుసుకుంటున్నామని ఆశిస్తాను. మీ నమ్మకం నా నమ్మకం; మీ దేవుడు – నా దేవుడు; మీ అభిప్రాయం – నా అభిప్రాయం; ఇలాగే జాతీయత, కుటుంబం, ఆలోచనా విధానం, అనుభవం – ఇవన్నీ మీవి వేరే, నావి వేరే అన్న భావనగా రకరకాల రూపాలలో ఈ ప్రతిరోధం అనేది వ్యక్తమవుతోంది. ఏ రకమైన నిశ్చయం – ఇప్పుడు చెప్పుకున్న విషయాలలో – మనకి ఉన్నా అదిఇంకొకదాన్ని నిరోధించడమే. అది భయానికి దారి తీయక తప్పదు. కొత్తగా మనం కనిపెట్టి నేర్చుకున్న విషయం ఇది.

మన మనసు ఇటువంటి పరిశీలనలోనే భయం యొక్క నిర్మాణం, స్వభావం గురించి నేర్చుకుంటుంది. ఇలా నేర్చుకుంటున్నప్పుడు అది కేవలం మీ సొంతమే. నేను మీకు ఇచ్చేది కాదు. మన జీవితాల్లో అత్యంత వింతైన విషయాల్లో ఇదొకటి. ఏం చెయ్యాలో చెప్పమని, దిక్కు చూపమని ఇంకొకళ్ళ వంక చూడటం. ఈ వక్త దగ్గర మీకు ఇవ్వటానికి ఏ సందేశమూ లేదు.అతడు మీకు కర్తవ్యాన్ని ఉపదేశించటం లేదు. కొత్త ఆశయాల్నీ, కొత్త తత్వాల్నీ లేదా కొత్త సూత్రాల్నీ ఇవ్వడం లేదు. ఇతడు చెప్పున్నదొక్కటే – 'గమనించండి', 'చూడండి' 'పరిశీలించండి' – అని. కానీ భయం ఉన్నపుడు ఈ చూడటం, గమనించడం, వినడం బహుశా సాధ్యపడదనుకుంటాను.

విభజన, నిరోధం ఉన్నపుడు భయం ఉంటుంది. మీరు జాతీయత అంటున్నపుడే ప్రపంచాన్ని విభజిస్తున్నారు. మీరు హిందువుగా,ముస్లింగా, పార్శీగా విడిపోయి, మీ పక్క మనిషీ అలాగే చేసినపుడు యుద్ధాలు తప్పవు. విడదీయడం, వేరేగా ఉండటం అనేవి ఎప్పటికైనా ఉపద్రవాలనీ, భయాలనీ తెచ్చిపెట్టక మానవు.కదూ.మన చుట్టూ గోడ కట్టుకోవడం – అంటే మానసిక రక్షణ కోసం చేసే ఈ ప్రతిఘటన భయాన్ని కలుగజేయక తప్పదు.

కాబట్టి మన అన్వేషణలో తరవాతి ప్రశ్న – మనమూ, వాళ్ళూ అన్న విభజన ఎందుకు జరుగుతుంది? మన మనసులో, మెదడు కణాలలో ఈ నిరోధం ఎందుకు ఉంది? మనం ఈ ప్రశ్నలోకి ఎలా వెళ్ళాలో నాకు తెలియడం లేదు. చేతన, అంతఃచేతన – సంప్రదాయం, ఆధునికం – మీదీ, నాదీ – ఇలా రకరకాలుగా మన మనసే భాగాలుగా, ముక్కలుగా విడిపోయి ఉంది. ఈ ' విభజన', 'ఇంకొకదాన్ని వద్దని ఆపడం' అనేవి ఎందుకుఏర్పడతాయో నేను ఆలోచించి కనిపెట్టాలి అని మన మనసులోని ఒక శకలం అంటుంది. మనకి ఏబాధలూ లేని రక్షణ కావాలి– అందుకనే మనం నిరోధిస్తాం. ఈ నిరోధం భయాన్ని కలుగేస్తుంది. దీన్ని చూసిన మనసు అడుగుతుంది – ఎందుకని విభజిస్తున్నాను? ప్రతిఘటిస్తున్నాను? – అని. కానీ ఈ ప్రశ్న అడిగేదెవరో మీరు గమనించారా. ఉన్నదాని నించి విడిపోయి, తనని తాను వేరేగా విభజించుకున్న మనసులోని భాగం అడుగుతున్న ప్రశ్నా ఇది? లేక మొత్తం మనసు అంటే మన సంపూర్ణ సత్వం వేస్తున్న ప్రశ్నా? తేడా మీకు అర్థమవుతున్నదా. భయాన్నించి విడివడ్డ ఒక ముక్క– ఇదీ మనసులోని భాగమే – అంటోంది. ఏమని? "ఏ రకమైన ప్రతిరోధం ఉన్నా భయం కలుగుతోంది అన్న విషయం నాకర్థమయింది" అని. మనసులోని ఆ భాగమే అడుగుతోంది "అసలు ఎందుకని నిరోధిస్తాను?" అని. అసలు ఈ ప్రశ్నే తప్పు కదా? అత్యంత సమగ్రమూ,

## మన నిత్య జీవన కార్యకలాపాలకు కేంద్రం మనమే

ప్రకృతి మన జీవితంలో భాగం. మనం జన్మించినది బీజంలో నుండి, ఈ భూమిలో నుండి. వీటన్నింటిలో మనమూ ఒకరం. మనమూ ఈ జంతుజాలమూ అంతా ఒకటే అనే భావం నుండి అతివేగంతో మనం ఎక్కడికో దూరంగా వెళ్లిపోతున్నాము. ఆ చెట్టుపై మీ హృదయంలో ఒక సహానుభూతి వున్నదా? దాని వైపు చూడండి. దాని అందాన్ని పరికించండి. ఆ చెట్టు చేసే శబ్దాలను శ్రద్ధగా వినండి. చిన్న మొక్క ఎడల, గడ్డిపోచ ఎడల, గోడ మీదకు పాకుతున్నఆ తీగ ఎడల సున్నితంగా ఉండండి. వీటన్నింటి గురించిన ఎరుక మీలో ఉండాలి. మీ చుట్టూ ఉన్న ప్రకృతితో మీకు అన్యోన్య భావప్రసారం జరుగుతూ ఉండాలి. మీరు నగరంలో నివసిస్తున్నారేమో. అక్కడ కూడా కొన్నిచెట్లయినా ఉంటాయి. మీ పొరుగున ఉన్నతోటలో పూల మొక్కలకు బహుశ సరియైన సంరక్షణ లేదేమో. గడ్డీగాదం పెరిగి పోయాయేమో. అయినా సరే, అటువైపు చూడండి. మీరూ అందులోని భాగమే అనే భావాన్ని అనుభూతి చెందండి. సమస్త ప్రాణికోటిలో మీరు ఒక భాగం. మీరు కనుక ప్రకృతిని గాయపరుస్తే మిమ్మల్ని మీరే గాయపరచుకున్నట్లవుతుంది.

*(లెటర్స్‌టుది స్కూల్స్ నుండి)*

మౌలికమూ అయిన ఇటువంటి ప్రశ్నని మనసులోని ఒక చిన్న భాగం వేస్తున్నపుడు, దానికి సమాధానం ఇవ్వడం కుదురుతుందా. అది ఇచ్చే సమాధానం ఎప్పుడూ పాక్షికంగా ఉంటుంది. అందువల్ల అది ఎప్పటికీ అసత్యమే. మనసులోని ఒక శకలం అసలు ఇలాంటి విస్తారమైన, సమగ్రమైనప్రశ్నని అడగగులుగుతుందా? శకలాలుగా,ముక్కలుగా విడిపోని మనసు మాత్రమే ఇలాంటి ప్రశ్నని వేయగలుగుతుందా?

ఎందువల్ల ప్రతిరోధం కలుగుతోందన్నది కాదు ఇప్పుడు ప్రశ్న. మనసు ఈ భయం యొక్క సంపూర్ణతత్త్వం వైపు చూడగలదా అన్నది ప్రశ్న. మృత్యు భయం, అభద్రతా భయం, ఇంకొకళ్ళు ఆక్రమించుకుంటారన్న భయం, మన జీవితాన్ని కోల్పోతామన్న భయం - ఇట్లా మనకెన్నో భయాలు. ప్రతి భయానికీ విడివిడిగా పరిష్కారం మనసులో ఉన్న ఏదో ఒక శకలం సహాయంతో మీరు చెప్పగలరా? లేక అసలు సంపూర్ణ సమాధానం దొరికే ఒకటే ప్రశ్న - సమస్తమైన భయాల గురించినది- వేస్తారా?

కాబట్టి మనం చేయబోయేది భయం లోపలికి వెళ్లి దాన్ని గురించి అన్వేషించడం కాదు. ముక్కలుగా విభజింపబడని మనసు యొక్క స్వభావాన్ని గురించి తఱచి చూస్తున్నాం. ఎందుకంటే అలాంటి సంపూర్ణమైన మనసు అడిగే ప్రశ్నకి సంపూర్ణమైన సమాధానం లభిస్తుంది కనుక. మీకు అర్థమవుతున్నదా? సరే. మరి ఏమాత్రం ప్రతిరోధమూ, విభజనా లేకపోవడం వల్ల కలిగే భయరహిత స్థితిలో ఉన్న మనసూ, హృదయమూ - అవి ఏమిటి? ఎట్లా ఉంటాయి? మనసులో ఉన్న ఒక శకలం, భాగం, ముక్క అని మనం అంటున్నప్పుడు వాటి అర్థం ఏమిటి? మీరు మీ మనసును ఎప్పుడైనా గమనించారా? సరి చెయ్యడం, తప్పనీ ఒప్పనీ అనడం కాకుండా కేవలం గమనించడమే- మీరెప్పుడైనా చేసారా? మనలో ఉన్నలెక్కలేనన్ని విభజనలూ, రకరకాల వాంఛలూ, అనేకమైన సుఖాలూ, భయాలూ, దు:ఖాలూ-వీటన్నంటినీ గమనించారా? బాధల్నించీ, భయాల్నించీ, తప్పించుకుపోవడం; సుఖం కోసం వెంపర్లాట-ఇవన్నీ మీలో చూసుకున్నారా? అలాగైతే, మరి చూచే వాడెవడు? గమనిస్తున్న మెదడులోని, మనసులోని భాగమే కదా వీడు? అంటే ఒక భాగం, ఒక శకలం మిగతా ముక్కలనీ, ఖండాలనీ చూస్తోందన్నమాట. ఇది చాలా ఆసక్తికరమైన విషయం. ఒక భాగం ఇంకొక భాగాన్ని చూస్తూ చెప్పే సమాధానం ఎప్పుడూ అసంపూర్ణంగానే ఉంటుంది. అందువల్ల ఈ నిరోధించడం అనేది ఎప్పటికీ సమసిపోక, అపరిష్కృతంగా ఉండిపోతుంది. భయం ఎప్పటికీ నశించదు. మనసు ఎలా చూస్తోంది, గమనిస్తోంది అనేదే మన ప్రశ్న. చూసేది ఒక ఖండమేనా? లేక మనసు మొత్తం అంతా ఒకటిగా చూస్తోందా?

చూసేవాడి ప్రమేయం లేకుండా, అంటే విభజన లేకుండా మనసు చూడగలదా? ఇదీ మనం ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న. ఒక భాగం లేదా శకలం ఇవి పాలు పంచుకోని, పని చెయ్యని "గమనిక" అనేది ఉందా? అంటే చూచేవాడు లేకుండా చూడటం అన్నమాట. చూసేవాడే ఈ శకలం. వాడే గతం. మీరు ఈ మైక్రోఫోన్‌ని, సూర్యాస్తమయాన్ని, మీ భార్యని ఇలా దేనిని చూసినా ఈ గతం ద్వారానే చూస్తారు. గతం అంటేనే గడచిపోయిన అనుభవం, దాన్ని గురించిన సమాచారం. ఇది తప్పని సరిగా ఒక శకలమే అయి ఉంటుంది. మీ గతం ప్రతిరోధాన్ని సృష్టించక తప్పదు.మీరు గతంలో భయాన్నో సుఖాన్నో పొందారు. అమ్మో! రేపు ఇంకా బాధ పడతానేమో అంటారు. లేకపోతే రేపు నేను ఇంకా సుఖపడగలనా? అని అడుగుతారు. కాబట్టి ఈ గమనిస్తున్న వాడు గతమే. వాడే ఒక విభజన. ఇప్పుడు మనసు అడుగుతోంది దృష్టి లేకుండా దృష్టి సాధ్యమేనా? అని. ఇది నిజంగా అసాధారణమైన ప్రాధాన్యత ఉన్న ప్రశ్న. దీనికి మీ సమాధానం నిజమైతే, అప్పుడు మొత్తం ప్రయత్నాలూ, ప్రయాసలూ, పోరాటాలూ, ఘర్షణలూ-వీటి నిర్మాణాలన్నింటినీ మీరు ఒక్కసారిగా కూల్చివేసినట్లే. అలాగే హింసను కూడా.

ఇది కనుగొనాలంటే నిత్యజీవితంలో మనం అనేక విషయాలని ఎలా చూస్తున్నామో గమనించాలి. ఒక చెట్టుని, లేక మీ భార్యనీ, భర్తనీ, మీ ప్రొఫెసర్‌నీ, లేక మీ భవిష్యత్తునీ ఎలా ఏ దృష్టితో చూస్తున్నారో దాన్ని గమనించాలి. మరి గమనించేవాడు లేకుండా చూడగలరా? ఎందుకంటే గమనించేవాడున్నప్పుడు దూరాన్నీ కాలాన్నీ సృష్టిస్తాడు. అదేనిరోధం. ఈ ఘర్షణల వెనక ఉన్న అసలు విషయం - చూచేవాడికీ చూడబడేదానికీ మధ్య ఉన్న విభజనే. ఇదే మనల్నిబంధిస్తోంది. నిబద్ధీకరిస్తోంది. చిన్నప్పటి నుంచీ అలాగే పెరిగాం. వేల సంవత్సరాల నుండీ మనం దీనికి కట్టుబడ్డాం. ఉన్నతాత్మ- అధమాత్మ, మంచీ, చెడూ; దేవుడూ, దెయ్యం; శరీరం, ఆత్మ; సమాజిక నీతి, అవినీతి; ఇలా ఎన్నో రకాలుగా.

గతంలో సంబంధం లేకుండా, రాబోయే దాన్ని గురించిన ఏ ఊహలు లేకుండా, ఈ నేను అనేది తన మొత్తం సత్తాతో మనసూ, హృదయమూ, మెదడు కణాలూ, ప్రాణం అంతా కలిసి ఒకటిగా చూడగలదా?

కొన్ని రకాల మాదక ద్రవ్యాలు ముఖ్యంగా ఎల్. ఎస్. డి లాంటివి తీసుకున్నపుడు చూసే వస్తువుకీ, చేస్తున్నవాడికీ దూరం మాయమవుతుందని అవి తీసుకున్నవాళ్ళు చెప్పారు. ఈ దూరం మాయమవడం వల్ల ఒక తక్షణ సంబంధమూ, స్పర్శానుభూతి కలుగుతుంది. జీవితంలో మున్నెన్నడూ ఎరుగని రీతిలో మీరు అప్పుడు చూడగలరు. మాదక పదార్థం తీసుకొని మ్యూజియంకి వెళ్ళే ఒకాయన నాకు తెలుసు. అప్పుడు ఆయన చూసే వర్ణాలూ,వాటి పొందికా, గాఢతా, లోతూ, ఆ ఛాయా, కాంతీ నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉంటాయి. అయితే ఇది మందు చేసే రాసాయనిక చర్య వల్ల కలిగింది.కనుక మీరు తాగుబోతులా ఆ మందు మీదే ఆధారపడి దానిని తీసుకుంటూనే ఉండాలి. ఈ ప్రపంచపు అద్భుతాన్ని వీక్షించడానికి ఎప్పుడూ దాన్ని పుచ్చుకుంటూనే ఉండాలి.

ఉపవాసం చేత శరీరాన్ని అత్యంత సున్నితంగా చేయడం ద్వారా కూడా ఇలాంటి రాసాయనిక చర్య జరుగుతుంది.మాదక ద్రవ్యాలూ, ఉపవాసాలూ, ఇలాంటి రసాయనిక ప్రక్రియలూ, యుక్తులూ ఏవీ లేకుండా ద్రష్ట లేని దృష్టితో చూడగలరా? అప్పుడు అత్యద్భుతమైనది సంభవిస్తుంది. మాదక ద్రవ్యం వల్ల కలిగే దానికీ, దీనికీ ఊహాతీతమైన భేదం ఉంటుంది. ఎందుకంటే ఇది ప్రోది చెయ్యబడ్డదీ, ప్రేరేపించబడ్డదీ కాదు కాబట్టి. ఇది ప్రత్యక్ష యదార్థమూ, ఆచరణ సాధ్యమైన నిత్యవ్యవహార సత్యమూ. ఇక్కడ కాలవిభజనా, దూర విభజనా- అంటే కాలం వల్లా, దూరం వల్లా వేరు పడటం అనేది ఉండదు. కాబట్టి అప్పుడు ప్రయత్నమనేదే ఉండదు. అపుడు జీవితం అనేది చాలా భిన్నంగా ఉంటుంది. మీరు ఒకవేళ తప్పుచేసినా వెంటనే సరి దిద్దుకుంటారు. ఎక్కడైనా కొద్దిపాటి ఘర్షణ ఉంటే దాన్ని 'చూసి' తీసి వేసుకుంటారు. 'చూసేవాడు లేని గమనిక' వల్లనే అక్కడ తక్షణ చర్య ఉంటుంది. అందువల్ల ఆ ఘర్షణ నశిస్తుంది.

భయంవైపు ద్రష్ట లేకుండా చూసినపుడే మీరు పరమ ప్రశ్న - అంటే సర్వాన్నీ సవాలు చేయగలిగే సమగ్ర ప్రశ్నని వేయగలరు.'భయం అనేది లేదు' అనేదే దీనికి స్పష్టంగా లభించే పరిపూర్ణ సమాధానం. ఈ జవాబు తార్కిక పరిష్కారమో, నిశ్చయమో కాదు. ఇది నిజంగా ఉన్న సత్యం. చూడండీ అందరికీ మృత్యువంటే భయమే.

*(తక్కినది వచ్చే సంచికలో)*

(*1వ పేజీ తరువాయి*) . . .

## సంతోషాన్ని వెతికి పట్టుకోగలమా?

వుంటుంది, లేదా చూడకపోవడం వుంటుంది. అంతే, తక్కినవన్నీ- సంతోషం, విచారం, తెలివి అన్నీ వట్టి మాటలు.

**ప్రశ్నిస్తున్నవారు:** అప్పుడు, చూడటం అంటే ఏమిటి?

**కృష్ణమూర్తి:** చూడటం అంటే ఆలోచన ఏరకంగా వ్యతిరేకాలు అనే ద్వంద్వాలను సృష్టిస్తున్నదో అర్థంచేసుకోవడం. ఆలోచన తయారు చేసినది ఏదీ నిజం కాదు. చూడటం అంటే, ఆలోచనల, స్మృతుల, సంఘర్షణల, ఊహల స్వభావనైజాలను అర్థం చేసుకోవడం. ఇదంతా కలిసి ఒక సంపూర్ణ ప్రక్రియ అని చూడటమే అవగాహన చేసుకోవడం. ఇదే తెలివి తేటలు అంటే. సమస్తాన్నీ మొత్తంగా చూడటం తెలివి. ముక్కలు ముక్కలుగా తీసి చూడటం అంటే తెలివిహీనత.

**ప్రశ్నిస్తున్నవారు:** నాకు కొంచెం గాభరాగావుంది. అర్థం అయిందనే అనుకుంటున్నాను. అయితే కొంత స్పష్టాస్పష్టంగా అనిపిస్తున్నది. చాలా మెల్లగా పోవాలి. మీరు ఏమంటున్నారంటే- సంపూర్ణంగా చూడండి, వినండి అని. ఈ సావధానతే తెలివి అని మీరు అంటున్నారు. పైగా ఇది వెంటనే, తక్షణమే జరగాలని మీరు అంటున్నారు. మనం ఇప్పుడు (ప్రస్తుతం) మాత్రమే చూడగలుగుతాం. నేను ఇప్పుడు నిజంగా చూస్తున్నానా లేక ఇంటికి వెళ్ళి మీరు చెప్పినదానిని గురించి ఆలోచించబోతున్నానా, ఆ రకంగా తరువాత ఎప్పుడో చూడగలనని ఆశిస్తున్నానా?

**కృష్ణమూర్తి:** అట్లా కనుక అయితే ఇక మీరు ఎన్నటికీ చూడలేరు. దానిని గురించి ఆలోచిస్తుంటే ఎన్నటికీ చూడలేరు. ఎందుకంటే ఆలోచన చూడడానికి నిరోధమవుతుంది. చూడటం అంటే ఏమిటో మనిద్దరికీ అర్థమైంది. ఈ చూడటం అంటే సారాంశం కాదు, ఒక ఊహ కాదు, ఒక నైరూప్య భావన కాదు. చూడటానికి ఏమీ లేనప్పుడు మీరు చూడలేరు. ఇప్పుడు మీ వద్ద విచారం అనే సమస్య వున్నది. ఆ సమస్యని పూర్తిగా చూడండి. సంతోషంగా వుండాలని మీరు అనుకోవడమూ, ఆలోచన ఏవిధంగా ద్వంద్వాలను తయారు చేస్తున్నదీ తో సహా. సంతోషం కోసం అన్వేషణను చూడండి; సంతోషం పొందడానికి గాను సహాయం కోరుకోవడమూ చూడండి. నిరాశలను, ఆశలను, భయాలను చూడండి. ఇదంతా కూడా విడివిడిగా కాకుండా ఒకే అఖండంగా, సమస్తంగా, సంపూర్తిగా చూడండి. ఇప్పుడే దీనంతటినీ చూడండి. మీ సమస్త ధ్యాసనూ దీనిపై పెట్టండి.

**ప్రశ్నిస్తున్నవారు:** నాకు ఇంకా కొంత గాభరాగానే వున్నది. అసలు సారాంశాన్ని, మొత్తం విషయాన్ని నేను అందుకున్నానో లేదో నాకే తెలియదు. ఈ విషయం నాకు నిజంగా అర్థమైందో లేదో చూడటానికి కళ్ళు మూసుకొని, నాలోకి నేనే చూసుకోవాలనుకుంటున్నాను. అర్థమైతే కనుక, అప్పుడు నా సమస్య పరిష్కారమైందన మాట.

***(ది అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్; పుటలు 151-156)***

# ఇదేనా మతం అంటే

మతం అని ఇప్పుడు అందరూ అంటున్నది కేవలం ఒక ప్రచారం అయిపోయింది. స్వలాభ పరత్వం, పెద్ద ఆస్తులు, అంచెలంచెల ఆధిపత్యాలు, అధికార శ్రేణీ ఆ పద్ధతులతో కూడిన 'ఆధ్యాత్మికత' అయింది. మతం అంటే మూఢ విశ్వాసం, నమ్మకాలు, పూజలు-కర్మకాండలు. నిత్యజీవితంతో బొత్తిగా సంబంధం లేని విషయమై పోయింది. మీకు దేవుడంటే నమ్మకం ఉండవచ్చు, లేకపోవచ్చు. నిత్యజీవితంలో ఈ నమ్మకానికి పెద్ద ప్రాముఖ్యం లేదు. మోసాలు చేస్తుంటారు, విధ్వంసం చేస్తుంటారు; ఆకాంక్షలు, అత్యాశలు, అసూయలు హింసా అన్నీఅట్టే పెట్టుకుంటారు. దేవుడినో, ఒక రక్షకుడినో లేదా అంటే ఒక గురువునో నమ్ముకుంటారు. అయితే అదంతా దూరంగా ఎక్కడో ఉంచి అది నిత్యజీవితాన్ని తాకకుండా చూసుకుంటారు.

ప్రస్తుతం మతం ఒక బ్రహ్మాండమైన కార్యక్రమం అయింది. బొత్తిగా విలువ లేని విషయం అయింది. ప్రపంచంలో ఉన్న అన్ని మతాలూ ఇట్లా అర్థహితంగా తయారయాయి. మనకి ఆధ్యాత్మిక కాలక్షేపం కావాలి. అందుచేత చర్చికో, గుడికో, మసీదుకో వెళతాం. దీనికి మన నిత్యజీవితాల్లోన్ని దు:ఖంతో గందరగోళంతో, ద్వేషాలతో ఏమీ సంబంధం లేదు. నిజంగా లోతుగా ఆలోచించే మనిషి, ఈ భయంకరమైన అస్తిత్వం కంటె మిన్నఅయినదేదైనా ఉన్నదేమో కనుగొనాలని నిజంగా కోరుకునేవాడు మూర్ఖవిశ్వాసాలను, నమ్మకాలను, ప్రచారాన్ని పూర్తిగా వదులుకోవాలి. సందేహం లేదు, 'మతాత్మకుడి'గా అతడిని పెంచి తయారు చేసినవ్యవస్థ నుండి అతడు విడుదల పొందాలి.

*(బియాండ్ వయొలెన్స్, అధ్యాయం - 4)*

**వినతి**

**'అంతరంగ యాత్ర' మీ మిత్రులు, సన్నిహితులు కూడా చదువుతే బాగుంటుంది అని అనిపిస్తే, వారి చిరునామాలు మాకు పంపండి. ఉచితంగా పత్రిక పంపుతాము.**

*Published in August, December & April*

Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliverd please return to:*

KRISHNAMURTI FOUNDATION INDIA

Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road

Chennai - 600 028. Tel: 24937803/24937596

E-mail: publications@kfionline.org

Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*